క్లుప్తంగా

జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన



బ్రోచర్స్ ఆవిష్కరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఇందిరా భవన్‌లో నగర మర్చంట్, ట్రేడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రేట్ సింహపురి ఎలక్ట్రానిక్స్ ఫెస్టివల్ పేరుతో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ బ్రోచర్స్‌ను విడుదల చేశారు. అనంతరం జాయింట్ కమిషనర్(ఎస్టీ) వై.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నాలుగు వారాల పాటు నిర్వహించే కార్యక్రమంలో తగ్గిన జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించడం, లభించే ప్రయోజనాలను వివరిస్తామన్నారు.

నవంబర్ 2న అంధుల సమాఖ్య జిల్లా ఎన్నికలు



మాట్లాడుతున్న మోపూరు రామసుబ్బయ్య

నెల్లూరురూరల్: రానున్న ఐదేళ్ల కాలానికి జాతీయ అంధుల సమాఖ్య జిల్లా యూనిట్ ఆఫీస్ బేరర్‌లను నవంబర్ రెండో తేదీ ఎన్నుకుంటామని ప్రధాన కార్యదర్శి మోపూరు రామ సుబ్బయ్య తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థి 2023 నుంచి యూనిట్లో నిరంతర సభ్యుడిగా ఉండాలని తెలిపారు. నామినేషన్ ఈనెల 18 నుంచి 20 వరకు ఉంటుందని తెలిపారు. అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి అభ్యర్థులకు తప్పనిసరిగా ముగ్గురు సభ్యులు ప్రతిపాదించి, బలపర్చాలని కోరారు. కార్యక్రమంలో యూత్ సెక్రటరీ దివాకర్, ప్రెసిడెంట్ నాగార్జున, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో వైట్‌కోట్ వేడుక



హాజరైన ప్రథమ సంవత్సర వైద్య విద్యార్థులు

నెల్లూరు (టౌన్): స్థానిక ఏసీ సుబ్బారెడ్డి వైద్య కళాశాలలో నూతనంగా చేరిన ప్రథమ సంవత్సర విద్యార్థులకు వైట్‌కోట్ వేడుక, యాంటీ ర్యాగింగ్, యాంటీ నార్కోటిక్స్‌పై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి వైద్య వృత్తి విశిష్టత, నేర్చుకోవాల్సిన మెళకువలు గురించి తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు వైట్‌కోట్‌లను అందజేశారు. ర్యాంగింగ్‌కు పాల్పడితే ఎలాంటి శిక్షలు ఉంటాయో సీఐలు రోశయ్య, జగన్‌మోహనరావు, టీవీ సుబ్బారావులు వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు గోపి, మహేష్, రూట్స్ ఎన్‌జీఓ అధ్యక్షుడు రసూల్, సూపరింటెండెంట్ మాధవి, వైస్ ప్రిన్సిపల్ బెన్హర్, మస్తాన్‌బాషా, వార్డెన్లు శ్రీకాంత్, ప్రశాంత్, వైద్యులు కీర్తితేజ, పుల్లయ్య పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు



మనుబోలు: లారీని అధిగమించే క్రమంలో రెండు బైక్‌లు ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. నెల్లూరులోని రంగనాయకులపేటకు చెందిన ఖాదర్‌బాషా పనినిమిత్తం గూడూరుకు బైక్‌పై వెళ్లి తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో కొండూరు సత్రం వద్ద హైవేపై ముందు వెళ్తున్న లారీని అధిగమించే క్రమంలో పక్కనే వస్తున్న మరో బైక్‌ను ఢీకొన్నారు. దీంతో క్షతగాత్రుడ్ని 108లో నెల్లూరు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దొంగకు దేహశుద్ధి

మనుబోలు: దొంగను స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన మండలంలోని కొండూరుసత్రంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. మనుబోలులోని ఓ దుకాణంలో యజమాని కళ్లుగప్పి కొన్ని వస్తువులను ఓ గుర్తు తెలియని వ్యక్తి రెండు రోజుల క్రితం చోరీ చేశారు. వీటిని విక్రయించేందుకు గానూ కొండూరుసత్రంలోని జాతీయ రహదారి పక్కనున్న ఓ హోటల్ వద్ద బేరాలాడుతూ అనుమానాస్పదంగా కనిపించారు. మనుబోలులో చోరీ విషయాన్ని సీసీటీవీ ఫుటేజీలో స్థానికులు చూసి ఉండటంతో పట్టుకునేందుకు యత్నించారు. కత్తితో బెదిరిస్తూ తిరగబడగా, మరింత మంది పోగై అతడ్ని పట్టుకుని దేహశుద్ధి చేసి కాళ్లు, చేతులు కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శివరాకేష్ అక్కడికి చేరుకొని నిందితుడ్ని అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు.

ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ

- వైద్య కళాశాలల ప్రైవేటీకరణ అత్యంత దారుణం
- వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి



కోటి సంతకాల సేకరణ ఉద్యమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నేతలు, కార్యకర్తలు

నెల్లూరు సిటీ: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజల్లో తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ఈ క్రమంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం కూడా ఉద్యమంలా జరుగుతోందని వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గంలోని ఒకటో డివిజన్ కోడూరుపాడులో కోటి సంతకాల ప్రజా ఉద్యమ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు 45 రోజుల పాటు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 17 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చారని గుర్తుచేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెడికల్ కళాశాలల ఖ్యాతి జగన్‌మోహన్ రెడ్డికి వెళ్తుందనే అక్కసుతో సీఎం చంద్రబాబు నాయుడు వాటిని ప్రైవేటీకరణ చేసే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇది అత్యంత దారుణమన్నారు. రూరల్ నియోజకవర్గంలో 60 వేల సంతకాలు సేకరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంతకాల సేకరణ చేస్తున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

నూతన కార్యవర్గ ఏర్పాటు



ఎన్నికైన సభ్యులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఉన్న డీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వరరాజు, మహేష్, మీర్‌ఖాసింవలీ, కుమార్‌పాల్ హాజరై, రానున్న కాలంలో బ్యాంక్ అభివృద్ధికి అసోసియేషన్ సభ్యుల పాత్ర, తీసుకోవాల్సిన నిర్ణయాలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన విధి, విధానాలపై చర్చించారు. కాగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా సుష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీహరిబాబు, ట్రెజరర్‌గా గురున్నాథం, జాయింట్ సెక్రటరీగా సత్యవతి, అడ్వైజర్స్‌గా ఫణీంద్ర బాబు, గౌస్‌బాషా, అసిస్టెంట్ సెక్రటరీగా షాజిద్, సెక్రటరీగా ఇబ్రహీం, మహిళా సెక్రటరీగా గాయత్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వారిని పలువురు అభినందించారు.

అప్రెంటీస్‌షిప్ మేళా రేపు

నెల్లూరు (టౌన్): స్థానిక వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటీస్‌షిప్ మేళాను నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్ కె.శ్రీధర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కోల్గేట్, హామిల్టన్-శ్రీసిటీ, బ్లూస్టార్ శ్రీసిటీ, అశోక్ లైలాండ్, జేసీబీ గోల్డ్‌ఫీల్డ్స్, టాటా మోటార్స్, భార్గవి ఆటో మొబైల్స్, భారత్ బెంజ్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు తగిన ధ్రువ పత్రాలతో అప్రెంటీస్‌షిప్ మేళాకు హాజరు కావాలన్నారు.

వసతుల కల్పనకు చర్యలు

నెల్లూరు సిటీ: నగరంలోని సంతపేట పాత దుస్తుల మార్కెట్‌లో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నగరంలోని సంతపేట మార్కెట్‌ను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

నెల్లూరు(బృందావనం): జేమ్స్ గార్డెన్‌లో విజయగణపతి ఆలయ నిర్మాణ పనులకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయాల నిర్మాణాలతో సమాజంలో ఆధ్యాత్మిక చింతన కలుగుతుందన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలను తక్షణమే పునరుద్ధరించాలి

- వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలి
- లేకుంటే కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం



వెంకటేశ్వరపురం అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆరోగ్యశ్రీ సేవలను తక్షణమే పునరుద్ధరించాలని, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు ప్రభుత్వం వెంటనే ఆరోగ్యశ్రీ బకాయిలను చెల్లించి పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అంబాటులోకి తీసుకురావాలని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, కార్యదర్శి సభ్యుడు నాగేశ్వరరావు, నగర కమిటీ సభ్యుడు మూలం ప్రసాద్ డిమాండ్ చేశారు. నగరంలోని 54వ డివిజన్ జనార్ధనరెడ్డి కాలనీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధనరెడ్డి కాలనీ సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించి అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద నిరసన చేపట్టారు. అనంతరం వీరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు చెల్లించాల్సిన రూ.వేల కోట్ల బకాయిలను నిలిపివేయడంతో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపి వేశారని, దీంతో ప్రజలకు ఉచిత వైద్యం అందక ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా అర్బన్‌హెల్త్ సెంటర్‌లలో కనీస వసతుల్లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని, నామమాత్రపు వైద్య సేవలతో ప్రభుత్వ పనితీరు ఏంటో తెలుస్తోందన్నారు. వెంటనే ఆరోగ్యశ్రీ బకాయిలు విడుదల చేయాలని, లేని పక్షంలో కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ప్రైవేటీకరణపై ప్రజాగ్రహం

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన 17 మెడికల్ కళాశాలలను చంద్రబాబు ప్రైవేటు వారికి అప్పగిస్తూ తీసుకున్న నిర్ణయంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని వారు తెలిపారు. నిరంతరం పీ-4 జపం చేస్తున్న చంద్రబాబు తన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ రంగంలో వైద్య సౌకర్యాలు మెరుగుపరిచి, వైద్య కళాశాలలను ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సూర్యనారాయణ, నరసింహా, పద్మ, గడ్డం శ్రీనివాసులురెడ్డి, మద్దిపాటి శ్రీనివాసులురెడ్డి, మంజుల, భార్గవి, మహ్మద, వెంకటేశ్వర్లు, సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం



నెల్లూరు (టౌన్): అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జన విజ్ఞాన వేదిక, నగర సమత విభాగం ఆధ్వర్యంలో స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆడ పిల్లను పుట్టనిద్దాం, ఆడ పిల్లను బతకనిద్దాం, ఆడపిల్లను చదివిద్దాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జేవీవీ సీనియర్ నాయకుడు డాక్టర్ శీనునాయక్, జిల్లా కార్యదర్శి విజయకుమార్, సమత విభాగం కన్వీనర్ విజయమ్మ, కల్చరల్ కమిటీ సభ్యులు పార్వతి, సుబ్రహ్మణ్యం, కృష్ణ, మోహన్‌రెడ్డి, నాయకుడు మాదాల రాము, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల పరిస్థితి దయనీయం



నేతలతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- కూటమి ప్రభుత్వంలో ఇబ్బందులు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, పండించిన పంటను గిట్టుబాటు ధరకు విక్రయించే పరిస్థితుల్లేవని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బీ చెర్లోపల్లి, మనుబోలు మండలం లక్ష్మీనరసింహపురం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తనను కలిసిన రైతులతో ఆయన మాట్లాడారు. కొందామంటే కొరివి, అమ్ముదామంటే అడవి అనే చందంగా రాష్ట్రంలోని రైతుల పరిస్థితి మారిందని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా అతి తక్కువ ధరలకు కొని మిల్లర్లు, వ్యాపారులు.. అధిక రేట్లకు విక్రయించి లాభపడుతున్నారని ఆరోపించారు. సోమిరెడ్డి ఎప్పుడు అధికారంలో ఉన్నా మిల్లర్లతో కలిసి రైతుల నోట్లు కొట్టడం ఆనవాయితీగా మారిందని చెప్పారు. సర్వేపల్లిలో అవినీతి తప్ప అభివృద్ధి లేదని.. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు తమ పార్టీ హయాంలోనే జరిగాయని తెలిపారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని సోమిరెడ్డి కుమారుడు ఇష్టారాజ్యంగా గ్రావెల్, మట్టి, ఇసుక, బూడిద దందాలను సాగిస్తున్నారని ఆరోపించారు. పనులు చేయకుండానే జలవనరుల శాఖలో దొంగ బిల్లులు చేయించుకున్నారని.. విచారణ జరిపితే అన్ని విషయాలు బయటపడతాయని.. సంబంధిత అధికారులు జైలుకెళ్లడం ఖాయమన్నారు. పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా తమ పార్టీ ఘన విజయం సాధించడం తథ్యమని చెప్పారు. అనంతరం పలు వివాహ వేడుకలకు ఆయన హాజరయ్యారు. చెర్లోపల్లికు చెందిన సీనియర్ నేత బత్తల పెంచలరెడ్డిని పరామర్శించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



నెల్లూరు(క్రైమ్): మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు-1 స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.రమేష్‌బాబు ప్రజలకు సూచించారు. కొండాయపాళెం గేటు సెంటర్‌లో కేర్ (కమిటీ ఫర్ ఆల్కాహాల్ అవేర్‌నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడుకేషన్) కార్యక్రమం శనివారం నిర్వహించి మత్తు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. మత్తు పదార్థాలు లేని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు డి.శ్రీధర్, ఎస్.ప్రభాకర్‌రావు, జేవీఎల్ఎన్ మురళీకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంభాభిషేక మహోత్సవం



నెల్లూరు(బృందావనం): 250 ఏళ్ల చరిత్ర కలిగి పాత పెద్దాస్పత్రి ఎదురుగా ఉన్న సంజీవరాయ అభయాంజనేయస్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు శాస్త్రోక్తంగా సంప్రోక్షణ, హోమం, పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సుమారు రెండు వేల మందికి అన్నసంతర్పణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ వంశపారంపర్య నిర్వాహకులు నామ్‌దేవ్ నాగేంద్రకుమార్‌సింగ్-టీనా దంపతులు, కుటుంబ సభ్యులు పర్యవేక్షించారు.

నగరంలో జలకన్యల విన్యాసాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని ఎన్టీఆర్ నగర్ ఎస్వీజీఎస్ కళాశాల మైదానంలో పినాకిని ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ఆధ్వర్యంలో మెర్‌మెడ్ షోను ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు ఎం.రాజారెడ్డి, ఎస్కే బాబు, గడ్డం అచ్చయ్య నాయుడు తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ఫిలిప్పీన్స్‌కు చెందిన విదేశీ మహిళలతో పది అడుగుల వాటర్ టన్నల్‌లో విన్యాసాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే నయాగరా జలపాతాన్ని 190 అడుగుల వెడల్పు 25 అడుగుల ఎత్తుతో నిర్మించినట్లు వివరించారు. ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు.. శని, ఆదివారాలు మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు.

ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి



వివిధ రకాల వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఖాదర్‌వలీ

నెల్లూరు (టౌన్): ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, సాయంత్రం జ్వరం రావడం లాంటి లక్షణాలు ఉంటే సమీపంలోని ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ తెలిపారు. నగరంలోని మల్లికార్జునపురం అర్బన్ ఆరోగ్యకేంద్రం, రాజాగారివీధి ఆరోగ్య కేంద్రాలను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కఫం పరీక్షల్లో పాజిటివ్ వచ్చినట్లయితే ఆరు నెలల పాటు మందులు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. అనంతరం శోధన్‌నగర్‌లోని బాలికల వసతిగృహాన్ని సందర్శించి వ్యక్తిగత శుభ్రత, టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారి నాగేంద్రబాబు, ఏఎన్ఎంలు రమణమ్మ, ముంతాజ్, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అమ్మణ్ణి సేవలో శ్రీసిటీ ఎండీ



నెల్లూరు(బృందావనం): కరెంటాఫీస్ సెంటర్ దగ్గర ఉన్న రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని, ప్రాంగణంలో కొలువై ఉన్న మీనాక్షీసుందరేశ్వర స్వామిని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవి సన్నారెడ్డి శనివారం దర్శించుకున్నారు. స్వామివార్లు, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, ఖడ్గమాల తదితర పూజలు నిర్వహించారు. వేదాశీర్వచనాలతో రవి సన్నారెడ్డిని సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. తొలుత ఆలయ మర్యాదలతో ఆయన్ను ఆహ్వానించారు. కార్యక్రమంలో ఈఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి, ఉప ప్రధానార్చకుడు కుప్పచ్చి రవిశర్మ, అర్చకులు, వేదపారాయణదారుడు తదితరులు పాల్గొన్నారు.

12 గంటల పని విధానం రద్దుకు డిమాండ్



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 12 గంటల పని గంటల విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నరసింగరావు డిమాండ్ చేశారు. నెల్లూరు రూరల్ ప్రాంతంలోని నరుకూరు రోడ్డు సెంటర్‌లో సీఐటీయూ 12వ జిల్లా మహాసభలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై కొత్త చట్టాలు తీసుకొచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, ఎనిమిది గంటల పని విధానాన్ని మార్చి 12 గంటలుగా చేయడం సరికాదన్నారు. దీనిద్వారా కార్మికుల శక్తిని దోచుకునే వారిచే వెట్టిచాకిరీ చేయించుకునేందుకు ప్రభుత్వాలు కుతంత్రాలు పన్నుతున్నాయని ఆరోపించారు. నెల్లూరు జిల్లా అవినీతికి, అసాంఘిక కార్యకలాపాలకు, హత్యలకు అడ్డాగా మారిపోయిందన్నారు. దీనిపై చర్చించి ఉద్యమాలు నిర్వహించనున్నామన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ



నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డు వసంతోపు సెంటర్ వద్ద ఉన్న అబైడింగ్ హోప్ ట్రస్ట్ కార్యాలయంలో పౌష్టికాహార కిట్లను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ టైటస్ నిర్మల్‌కుమార్, వివిధ సంస్థలు, సంఘాలకు చెందిన నిర్వాహకులు గునుకుల కిశోర్, ఎ.జయప్రకాష్, డేవిడ్ లివింగ్‌స్టన్, క్రాంతి, బాబు, రూత్ బినోమి, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

సంతపేట ఇన్‌స్పెక్టర్‌గా వైవీ సోమయ్య



బాధ్యతలు స్వీకరిస్తున్న సోమయ్య

నెల్లూరు(క్రైమ్): నగరంలోని సంతపేట ఇన్‌స్పెక్టర్‌గా వైవీ సోమయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, నగర డీఎస్పీ పి.సింధుప్రియను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైవీ సోమయ్య మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక శక్తులు, నేరస్తులపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. కాగా సోమయ్య గతంలో జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో సీఐగా పనిచేశారు.